ప్రజాశక్తి

బుధవారం 22 నవంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పల్నాడు కలెక్టరేట్ ఎదుట రహదారిపై భోజనం తయారు చేసుకుంటున్న మున్సిపల్ కార్మికులు

రోడ్డుపై కార్మికుల భోజనం

- గుంటూరు, పల్నాడులో మున్సిపల్ కార్మికుల వంటావార్పు
- జగన్‌మోహన్‌రెడ్డి హామీ మేరకు పర్మినెంట్ చేయాలని డిమాండ్
- సమస్యలపై స్పందించకుంటే సమ్మె చేస్తామని హెచ్చరిక

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని తదితర డిమాండ్లతో కార్మికులు గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల ఎదుట మంగళవారం వంటావార్పు చేపట్టారు. గుంటూరులో ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో నిరసన తెలపగా నరసరావుపేటలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనతోపాటు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గుంటూరు నిరసనలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్మికులు చేసిన పోరాటాల సందర్భంగా వైసిపి నాయకులు పాల్గొని మద్దతు తెలియజేశారని, తమ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీలు గుప్పించారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అటకెక్కించారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులందరినీ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చి 'ఎంప్లాయీ' అని నమోదు చేయడంతో వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా నిలిచిపోయాయన్నారు. మరోవైపు ఉద్యోగులకు రావాల్సిన జీత భత్యాలు, ఇతర సౌక్యాలు ఏవీ వీరికి దక్కట్లేదన్నారు. 99.5 శాతం హామీలు అమలు చేశామంటున్న ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు గుర్తు లేవా అని ప్రశ్నించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనకు అవసరమైన అన్ని కోర్టు తీర్పులనూ అమలు చేస్తుందని, కానీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పును మాత్రం అమలు చేయట్లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మెకూ వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రమేష్‌బాబు, నాయకులు పి.శ్రీనివాసరావు, కె.శివయ్య, కె.వెంగమ్మ, భూషమ్మ, మంగమ్మ, పి.పూర్ణచంద్రరావు, జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

నరసరావుపేట నిరసనలో స్థానిక ధర్నా చౌక్ వద్ద వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. అక్కడే భోజనాలు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఎత్తున మున్సిపల్ కార్మికులు ర్యాలీగా వెళ్లారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య విభాగంలో 25 ఏళ్లుగా

▶ 2లో

గుంటూరు కలెక్టరేట్ ఎదుట రహదారిపై భోజనం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఓటరు జాబితాలో అక్రమాలు!

- తమ ఓట్లు తొలగిస్తున్నారని టిడిపి గగ్గోలు
- ఫారం-7 దాఖలులో 'అధికార' దుర్వినియోగం
- ఒకే డోర్ నంబరులో వందల ఓట్లు
- ఎన్నికలసంఘానికి ఫిర్యాదులు - ఒత్తిడిలో ఉద్యోగులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల సంఘ నిబంధనలను ఉల్లఘించి టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గగ్గోలు పెడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. నియోజకవర్గం స్థాయిలో అధికారులు వైసిపి నాయకుల ఒత్తిడికి తలొగ్గి వ్యవహరిస్తున్నారని చివరికి తాము బలైపోతామని బీఎల్వోలుగా ఉన్న ఉద్యోగులు వాపోతున్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపుకోసం ఓటర్ల జాబితాలే కీలకం కావడంతో వైసిపి, టిడిపి ఢీ అంటే ఢీ అంటున్నాయి. వైసిపి ప్రజా ప్రతినిధుల వత్తిడితో నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌వో)లు ఫారం-7 దరఖాస్తులను ఎడాపెడా స్వీకరిస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గం అత్తలూరులో 130, ఉంగుటూరులో 83 మంది స్థానికంగా ఉండటం లేదని ఓటర్ల జాబితాల నుంచి తొలగించారంటూ రెండు గ్రామాల ప్రజలు మంగళవారం నియోజకవర్గ కేంద్రమైనచ పెదకూరపాడులో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం, ఆరోగ్య కారణాలతో తాము స్థానికంగా నివాసం ఉండకపోయినా తమ ఇల్లు, కుటుంబ సభ్యులు, ఆధార్ కార్డులు ఇక్కడే ఉన్నాయని వారు చెప్పారు. తమ ఓట్లను తిరిగి పునరద్ధరించాలన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అక్టోబరు రెండు నుంచి ఫారం-7 దరఖాస్తులు 2679 వచ్చాయి. వీటిల్లో 20 మంది 1514 దరఖాస్తులు అందచేశారు. ఒక వైసిపి నాయకుడు 288 దరఖాస్తులు ఇచ్చారు. ఐదు కంటే ఎక్కువ మంది పేర్లతో దరఖాస్తులిస్తే ఈఆర్‌వో విచారణ చేయాల్సి ఉంది. ఒక్కో దరఖాస్తులో సగటున నలుగురున్నా దాదాపు 10 వేల ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు దాఖలు చేయడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఒక డోర్ నంబరుతో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉండకూడదు. తెనాలిలో ఒకే డోరు నెంబరుతో 1100 ఇళ్ల పరిధిలో 16 వేల ఓట్లు ఉన్నాయి. వీటి పరిశీలన అధికారులకు శిరోభారంగా మారింది. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, కొత్త ఓటర్లుగా చేరేందుకు ఫారం-6 సమర్పించినా ఓట్లు ఇవ్వడంలేదని మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లి మీనాకు ఫిర్యాదు అందచేశారు. పలు నియోజకవర్గాల్లో చనిపోయిన వారిపేర్లు కొనసాగిస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో బతికే ఉన్నా జాబితాల్లో స్థానికంగా ఉండటం లేదన్న నెపంతో ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ప్రస్తుతం ఎవరికి వారు తమ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. స్థానికంగా నివాసం ఉంటున్నట్టు గా తగిన ఆధారాలను సమర్పిస్తే ఓట్లను కొనసాగిస్తామని అధికారులు సంబంధిత వ్యక్తులకు చెబుతున్నారు. వీరి దరఖాస్తులకు ఆధార్ చిరునామా మార్పు, గ్యాస్ బిల్లు, స్థానికంగా నివాసం ఉంటున్నట్టు నిర్ధారణైతే చిరునామా మార్పుతో ఓటును మారుస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే అధికారులు కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి అధికార పార్టీ నాయకుల సిఫార్సుల అమలుకు చర్యలు తీసుకుంటున్నారని ఉద్యోగ వర్గాల్లో విమర్శలు వస్తున్నాయి.

తమ ఓట్లు తొలగించారని పెదకూరపాడులో ఆందోళన చేస్తున్న అమరావతి మండల ఓటర్లు

THE SALVATION ARMY
EVANGELINE BOOTH HOSPITAL
PONNURU, NIDUBROLU. ICT
Applications are invited for the following posts
(1) PHARMACIST (2) STAFF NURSES
SALARY IS NEGOTIABLE
INTERESTED CANDIDATES CAN SEND THEIR RESUMES
ON ARE BEFORE 25-11-2023 TO ebhadnidubrolu@gmail.com
Contact Administrator for further details .
Ph : 79814 81724

యడ్లపాడు గ్రామ మ్యాప్ నమూనా

ప్రజాశక్తి - యడ్లపాడు

ఫీల్డ్ వర్క్‌లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పల్నాడు జిల్లాలోని యడ్లపాడులో విలేజ్ మ్యాప్ నమూనా చిత్రాన్ని రూపొందించారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులు, పొలాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో ఏవో సరిత, ఉద్యాన విశ్వవిద్యాలయం మాజీ డైరెక్టర్ శివరామకృష్ణ, విఎఎ సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిఇటి నాగరాజు

నైపుణ్యాలను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర

ప్రజాశక్తి - పెదకూరపాడు

క్రీడా నైపుణ్యాలను వెలికితీయటమే ఆడుదాం ఆంధ్ర లక్ష్యమని పెదకూరపాడు జెడ్పి పాఠశాల పిఇటి నాగరాజు అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర'పై పెదకూరపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ నరసింహారావు సూచించారు.

బాండ్లు పంపిణీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టో (సూపర్ సిక్స్) బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం బుర్రిపాలెం గ్రామంలో నిర్వహించారు. జనసేన నాయకులతో ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ సర్టిఫికెట్ అందజేసారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలో పొందుపరచిన అంశాలు పేదలకు ఏవిధంగా తోడ్పడతయో తెలియజేసారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ సమకూర్చిన బాండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షేక్ కరీముల్లా మనవడు షేక్ మహిర్ పుట్టినరోజు సందర్భంగా మార్కెట్ యార్డ్, రైల్వే స్టేషన్ రోడ్, ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద పేదలు, యాచకులకు మంగళవారం అన్నదానం చేశారు. కాంట్రగడ్డ విజయకుమార్ మాట్లాడుతూ మనం సంతోషంగా ఉండే కన్నా పేదవాడి ఆకలి తీర్చడం ఎంతో ఆనందమని ఆయన చెప్పారు.

రోడ్డుపై కార్మికుల భోజనం

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తునా కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, నామమాత్రపు వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారని అన్నారు. పే స్కేల్ ప్రకారం వేతనాలు, కరువు బత్యం ,ఇంటి అద్దె, ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ మున్సిపల్ కార్మికులకు లేవని అన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రకళ, ఎ.సాల్మన్‌రాజు మాట్లాడుతూ జీవో 114 ద్వారా రాష్ట్రంలోని 10115 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పర్మినెంట్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించగా వారిలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఒక్కరైనా లేరని, అయితే తాము మాత్రం 40 వేల మందికి పైగా పని చేస్తున్నామని తెలిపారు. మేనిఫెస్టో తమకు భగవద్గీత, బైబిల్, ఖురాన్‌తో సమానమని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి మాట ఏమైందని నిలదీశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా మరోసారి శాంతియుతంగా ప్రదర్శన చేస్తామని, అయినా ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె చేస్తామన్నారు. ఆందోళనకు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్‌రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రవిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ సంఘీభావం తెలిపారు. నాయకులు వెంకయ్య, మల్లయ్య, పి.ఏసు, వీరకుమార్, జీవరత్నం, విజయలక్ష్మి, నరసింహారావు, సామ్యేలు, లాజర్, పి.శ్రీను, గోపి సీతారామయ్య, మార్తమ్మ, సుజాత, పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నల్ల తామర పురుగు నివారణపై అవగాహన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వెల్దుర్తి మండలం మండాదిలోని మిర్చి పొలాలను మాచర్ల ఉద్యాన అధికారి ఎన్.సురేష్ మంగళవారం పరిశీలించారు. నల్ల తామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఎకరాకు 200 కిలోల వేప పిండి భూమిలో వేయాలని, దీనివల్ల తామపురుగు కోశస్ధ దశలను నియంత్రించవచ్చని చెప్పారు. పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు 10 వేల పిపియం వేప నూనెను ఒక లీటరుకు రెండు మిల్లీలీటర్లు చొప్పున కలుపుకొని పిచికారి చేయాలన్నారు. నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడకూడదని, ఎరువుల వాడకంలో సమతుల్యత పాటించాలని అన్నారు. పసుపు రంగు, నీలిరంగు జిగురు అట్టలను ఎకరాకు 50 నుంచి 60 చొప్పున పొలంలో అక్కడక్కడ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పురుగు మందులైన అసిటామప్రిడ్ రెండు గ్రాములు లేదా థయోమితాగ్జామ్ 0.5 గ్రాములు లేదా స్పైరో మెసిఫెన్ 1 మిల్లీ లీటరును లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయాలన్నారు. మొక్కలలో సూక్ష్మ పోషకాల లోపం ఉన్నట్లు గమనిస్తే ప్రతి 20 రోజులకు ఒకసారి ఫార్ములా-4ను ఐదు గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయాలన్నారు. బొబ్బర తెగులు ఆశించిన పొలాల్లో నివారణ కొరకు తెగులు ఆశించిన మొక్కలను ప్రారంభ దశలోనే పీకి కాల్చివేయాలని, వైరస్ వ్యాపింపజేసే తెల్ల దోమను నివారించుకోవాలని సూచించారు. తెల్ల దోమ నివారణకు అఫిడో ఫైరోపెన్ ఒక లీటర్ నీటికి 2 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారి చేయాలని, గట్ల మీద కలుపు లేకుండా చూసుకోవాలని, కాయకుళ్ళ, కొమ్మ కుళ్లను గమనిస్తే ట్రిఫ్లాక్సీ స్ట్రోబిన్, టెబుకొనజోల్ కలిగి ఉన్న తెగులు మందులను ఒక లీటర్ నీటికి 2.5 గ్రాముల చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలని వివరించారు. కార్యక్రమంలో మండాది విహెచ్ఎ చంద్రశేఖర్, మిర్చి రైతులు పాల్గొన్నారు.

పైరును పరిశీలిస్తున్న అధికారులు

పటిష్టంగా జాతీయ ఆహార భద్రత చట్ట అమలు

సమావేశంలో వివరాలు అందుతున్న పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ ఆహార భద్రత చట్టం-2013 ప్రకారం ప్రతి కార్డుదారులకు నిత్యావసర సరుకులను ఎమ్‌డియు వాహనాలు ద్వారా సమయానికి పంపిణీ చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశం నరసరావుపేట పట్టణంలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ మాట్లాడుతూ కార్డుదారులకు నిత్యావసర సరుకులు వారి ఇంటి వద్దకే తీసుకువెళ్లి ఇవ్వాలని చెప్పారు. పంపిణీ వ్యవస్థలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని తన దృష్టి తెచ్చి వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, కమిటీ నెంబర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ, కమిటీ మెంబర్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ వరలక్ష్మి, పౌర సరఫరా కార్పొరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ కెవిఎస్ ప్రగతి పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి - రొంపిచర్ల : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను మండల కేంద్రమైన రొంపిచర్లలోని జెడ్‌పి పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం బియం సుభానీ మాట్లాడుతూ విద్యార్థులు సెలవు రోజుల్లో గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తకాలు చదవడం వలన విజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ఆటల పోటీల్లో విజేతలకు బహుమ తులు అందజేశారు. గ్రంథాలయ అధికారి కోసూరు వెంకట్రావు, సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు రాకుండా చర్యలు

ప్రజాశక్తి - పెదనందిపాడు : పెదనందిపాడు, కాకుమాను మండలాలకు సంబంధించి ఓట్ల సవరణ, మార్పులు చేర్పుల నిర్వహణ కమిటీ సమావేశం మంగళవారం పెదనందిపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఆర్డీవో పి.శ్రీకర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓట్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా దొంగ ఓట్లు చేర్చకుండా జాగ్రత్తగా పరిశీలించాలని వీఆర్వోలకు, సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు, ఈ సందర్భంగా ఏ ఇబ్బందులు తలెత్తిన ఉన్నతాధికారుల దష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో పెదనంది పాడు తహసిల్దార్ షేక్ మహబూబ్ సుభాని, కాకుమాను తహసిల్దార్ జె ప్రసాద్ రావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణన సర్వే శిక్షణలో మాట్లాడుతున్న మాస్టర్స్ ట్రైనీ శైలజ

కుల గణనలో పొరపాట్లను రానివ్వొద్దు

ప్రజాశక్తి దుగ్గిరాల

ఎటువంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా యాప్ లో ఉన్న వివరాల ప్రకారం కుల గణన నిర్వహించాలని మాస్టర్ ట్రైన్‌గా వచ్చిన అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.శైలజ అన్నారు. కుల గణన సర్వే నిర్వహించడానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మండలంలోని విఆర్వోలు పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో ఆమె మాట్లాడారు .సర్వే నిర్వహించేటప్పుడు తీసుకోవలసిన అంశాలపై ఆమె సూచనలు ఇచ్చారు. ఈనెల 27వ తేదీ నుండి వాలంటీర్ల ద్వారా సర్వే నిర్వహించనున్నారు. ఇన్చార్జి ఎంపీడీవో డి వీరయ్య మాట్లాడుతూ సర్వే అంశాలు ఏ ఏ ప్రాతిపదికన ఉంటాయో వాటి వివరాలు తెలిపారు. సర్వే సక్రమంగా సజావుగా నిర్వహించాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాసరావు ఎం ఈ ఓ కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జిజిహెచ్‌లో లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు

గ్యాస్ట్రో ఏంట్రాలజీ విభాగానికి జవసత్వాలు

ఆస్పత్రిలో 30 పడకల కేటాయింపు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో గ్యాస్ట్రో ఏంట్రాలజీ విభాగానికి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ జవసత్వాలు చేకూర్చారు. మంగళవారం గ్యాస్ట్రో ఏంట్రాలజీ వార్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మీడియా తో మాట్లాడుతూ త్వరలో లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలను ప్రారంభిస్తున్నామన్నారు. ఇంతవరకు చెన్నై, తెలంగాణ లో మాత్రమే ఈ శస్త్ర చికిత్సలు జరిగేవని అయన గుర్తు చేసారు. ప్రైవేట్ ఆసుపత్రి లో లివర్ మార్పిడి కోసం 20 నుంచి 30 లక్షలు ఖర్చు అవుతుందని ఆయన చెప్పారు. ఈ ఖర్చు పేద ప్రజలకు భారం మారుతుండటం వల్ల ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి లో లివర్ మార్పిడి శస్త్ర చికిత్స లు చేయాలనీ ఆదేశించారని ఆయన తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, చీఫ్ సెక్రటరీ ఎం టి కృష్ణబాబు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో లివర్ మార్పిడి చికిత్స చేయాలనీ ఆదేశించారని ఆయన అన్నారు. వచ్చే నెల డిసెంబర్ చివరి నాటికి లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసేందుకు నిర్ణయించుకున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం ఆసుపత్రి లో లివర్ మార్పిడి శస్త్ర చికిత్స లు చేసేందుకు అనుకూలంగా ఉందా లేదా అనేది నిపుణుల కమిటీ పరిశీలన చేసిందని ఆయన చెప్పారు. ఇప్పటివరకు ఏడెనిమిది పడకలు గ్యాస్ట్రో ఎంటరాలజి విభాగం కు పరిమితమైందని ఆయన చెప్పారు. ఈ పడకలను మరో 30 పడకలను పెంచాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. గ్యాస్ట్రో ఎంటరాలజి విభాగానికి మినీ ఐ సి యు లో పది పడకలు , మరో 20 పడకలు గ్యాస్ట్రో ఎంటరాలజి వార్డు లో సమకూరుస్తున్నట్లు అయన చెప్పారు. ఈ విభాగానికి సూపర్ స్పెషలిటీ కోర్సు కూడ రావడం వల్ల పడకల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఏర్పడిందని అయన అన్నారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి విభాగానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ డి ఎం ఈ డాక్టర్ నరసింహం దష్టికి తీసుకుని వెళ్ళమని ఆయన చెప్పారు. త్వరలోనే అనుమతి వస్తుందని ఆయన ఆశభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, హెచ్ డి ఎస్ వైస్ చైర్మన్ ఎం వేణుగోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎం యల్ ఏ ముస్తఫా, డి ఎం ఈ డాక్టర్ నరసింహం కూడా త్వరితగతిన లివర్ మార్పిడి ఆపరేషన్లు చేయాలన్న కతనిశ్చయం తో ఉన్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, గ్యాస్ట్రో ఏంట్రాలజీ హెచ్ ఓ డి డాక్టర్ కవిత, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

జీయర్ ఆశ్రమంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరంలోని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు (ఆశ్రమం)లో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. త్రిదండి చినజీయర్ స్వామి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. టిటి మొబైల్ ఫౌండేషన్, ఉమెన్స్ హెల్త్ క్యాంప్, వికాస తరంగిణి, మహిళా ఆరోగ్య వికాస్, వంశీ హార్డ్‌వేర్ సెంటర్, దీన్‌దయాల్ ఫౌండేషన్, విజయవాడ రావెళ్ల కంటి ఆసుపత్రి ఈ శిబిరంలో పాల్గొని వందలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించడానికి తోడ్పడ్డారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళల పాత్ర ఎంతో విలువైనదని చెప్పారు. మహిళల ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కుటుంబం కోసం మహిళలు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా పని చేస్తారని కొనియాడారు. అటువంటి వారికి వైద్యపరమైన సహాయం అందించేందుకు చినజీయర్ ట్రస్టు ముందుకు రావడం అభినందనీయమన్నారు. 500 మందికి పైగా మహిళలు ఈ వైద్యశిబిరంలో ఉచిత వైద్య సహాయం పొందడంతో పాటు మందులు కూడా ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్వాహకులు పి.వెంకటాచార్యులు, ట్రస్టు చైర్మన్ గోకరాజు గంగరాజు, విజయవాడ సిపి క్రాంతిరాణా టాటా, కాకినాడ ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు, ఆరోగ్యశ్రీ స్పెషల్ అధికారి అశోక్, వికాస తరంగిని అధ్యక్షులు వర్మ, రఘునాథ్, మాధవీ రవీంద్ర, విటల్‌బాబు, ఆరోగ్య వికాస్ సభ్యులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా వినియోగంపై వర్కుషాపు

ప్రజాశక్తి-తాడేపల్లి

నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల విద్యా శాఖ కార్యాలయంలో తాడేపల్లిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మాదక ద్రవ్యాల వినియోగం, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం వల్ల విద్యార్థుల జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. సరదాగా అలవాటై చివరకు మనిషిని హరించి వేస్తుందని తెలిపారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి సరైన అవగాహన, కౌన్సిలింగ్, డిఅడిక్షన్ సెంటర్లకు పంపించాలని కోరారు. అందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. తాడేపల్లి ఎంఇఒ శాంతకుమారి మాట్లాడుతూ అనేక మంది విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ పాల్గొన్నారు.

విద్యకు పేదరికం ఆటకం కాకూడదు

ప్రజాశక్తి దుగ్గిరాల : పేదరికం విద్యకు ఆటంకం కాకూడదు అనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ విద్యా రంగంలో పెను మార్పులు తీసుకొచ్చారని దుగ్గిరాల ఎంపీడీవో దానబోయిన సంతోష రూపవాణి అన్నారు. మండలంలోని పెదపాలెం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జడ్పిటిసి మేకతోటి అరుణ మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలలో గ్రామానికి దాదాపు రూ.22కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్టీ బండ్ల కృష్ణ ప్రసాద్ కార్యదర్శి టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్లపై కేసు నమోదు వైసిపి కుట్ర

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ని అప్రతిష్ట పాలు చేయాలని వైసిపి కుట్రలో భాగమే దాడి ఘటనను సృష్టించి నరేంద్ర కుమార్ తో సహా 15 మందిపై అక్రమ కేసులు బనాయించారని పొన్నూరు పట్టణ టిడిపి నాయకులు విమర్శించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సంగం డెయిరీ ప్రతి 10 రోజులకు ఒకసారి రాష్ట్రంలోని డెయిరీ పరిధిలోని రైతులందరికీ పాల బిల్లును చెల్లిస్తుంది. అలాగే ప్రతి ఏడాది ఆర్జించిన లాభాలను నిష్పత్తి ప్రకారం పాల రైతులకు బోనస్ గా చెల్లిస్తుంది. ప్రభుత్వం పెంచి పోషిస్తున్న అమూల్ కు మేలు కలిగించేలా సంగం డెయిరిని అప్రతిష్ట పాలు చేసేలా కుట్రలు జరుగుతునాయన్నారు. అందులో భాగమే ఏలూరు జిల్లా వాసులు 40 మంది సంగం డెయిరి పై దాడికి ప్రయత్నించడమే కాకుండా అమాయకులపై ముందే నిర్దేశించుకున్న పథకం ప్రకారం ఎస్సీ, బీసీ యువకులను లక్ష్యంగా చేసుకొని తమపై దాడి చేశారంటూ ఆరోపిస్తూ కేసులు పెట్టారు. ఏలూరు జిల్లా వాసులకు వడ్లమూడి గ్రామంలోని యువకుల పేర్లు, ఇంటి పేర్లు, తండ్రి పేర్లు ఎలా తెలిసాయో ఎద్దేవ చేశారు . కుట్ర కోణంలో భాగంగానే అక్రమ కేసులు పెట్టారని అనడానికి ఇదే నిదర్శనం అన్నారు. మొదటి రోజు కేవలం 13 మంది పేర్లు ఉంటే రెండో రోజు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ని లక్ష్యంగా చేసుకొని మరో రెండు పేర్లు చేర్చడం వెనుక వైసీపీ నాయకుల ప్రమేయం ఉందని అన్నారు. కార్యక్రమంలో , పొన్నూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, చేబ్రోలు మండల పార్టీ అధ్యక్షులు మైలా వెంకటరామరాజు పాల్గొన్నారు.

బాప్టిస్టు చర్చి ప్రతిష్టా మహోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి

ముగ్గురోడ్డులోని తెలుగు బాప్టిస్టు చర్చి 12వ ప్రతిష్ట మహోత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రెవ పాస్టర్ డేవిడ్‌రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు, పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి, ఎం.ప్రకాష్, రవికుమార్, జడ్సన్, సుధాకర్, సమ్‌సాన్, అనిల్, బెంజిమెన్ పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పేరుతో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాకలో రోడ్డు వెడల్పు పేరుతో ఎంటిఎంసి అధికారులు మంగళవారం ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరం లేని చోట్ల రోడ్లు ఎందుకని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు బోరున విలపించారు. దీంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. టిడిపి గ్రామ అధ్యక్షులు కొల్లి శేషు అక్కడకు చేరుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. అవసరం ఉన్న చోట్ల అభివృద్ధి చేయకుండా అవసరం లేని చోట్ల ఇళ్ల ప్రహరీగోడలు పగలగొట్టి రోడ్లు నిర్మించడం సరైనది కాదని విమర్శించారు.

టిడిపి నాయకుల అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లిలో జరిగిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. ప్రభుత్వానికి, సిఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లక్షలాది రూపాయల స్కామ్‌లు వివిధ పథకాల ద్వారా కొల్లగొడుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న పోలీసులు టిడిపి కార్యకర్తలను అరెస్టు చేసి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు డి.జ్యోతిబస్, లాం నరేష్, గాదె శ్రీనివాసరావు అరెస్టయిన వారిలో ఉన్నారు. అరెస్టయిన వారిని టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు పరామర్శించారు. వెంటనే విడుదల చేయాలని కోరారు. సాయంత్రానికి సొంత పూచీకత్తుపై టిడిపి కార్యకర్తలను విడుదల చేశారు.

IN THE COURT OF THE IST ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: TENALI
E.P. NO. 27/2022 IN O.S. NO. 302/2021

Between :
Shaik Mahaboob Basha ... D.Hr.
And
Nadakuduru Prabhakara Rao ... J.Dr.

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నంబరు ఇ.పి. బాపతు డిహెచ్ఆర్ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ పేర్కొనబడిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని ది. 09-12-2023వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై శ్రీ కోర్టువారి ఆవరణ నందు బహిరంగ వేలము చేయబడును. ఆసక్తి గలవారు వేలము నందు పాల్గొనవచ్చును. వేలము షరతులు, వేలము సమయము నందు తెలియపరచబడును.

వేలము చేయు ఆస్తి వివరము

Guntur District – Duggirala Sub District – Kantamrajukonduru grama panchayat, Kantamrajukonduru Village, Duggirala Mandal, D.No. 258 – Ac.14-54 cents, an extent of Ac.0-56.5 cents of dry land bounded by:
East : Kalva Durga Rao's land.
South : Krosuri Ramesh Babu's land.
West : Puli Anuradha's land
North : Dayananda Rao's land
Within these boundaries an extent of Ac.0-56.5 cents of dry land.
D.Hr. Value ... Rs.1,00,000/-
Ameena Value Rs.17,00,000/-
Further hearing Date ... 14-12-2023
Tenali,
Dt. 21-11-2023.

దిండు శ్రీనివాస్, బి.కాం., బి.ఎల్.,
డిహెచ్ఆర్ తరఫున న్యాయవాది, తెనాలి.
సెల్ : 9849229704

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
F.D.I.A. 97/2016 in O.S. 35/1992

Between:
కాదాంబరి సరోజినీ దేవి ...పిటీషనర్
మరియు
గుడ్ల శ్రీ వేంకటేశ్వర్లు @ కంభం శ్రీ వెంకటేశ్వర్లు అండ్ ఇతరులు ...రెస్పాండెంట్స్

టు :
6వ రెస్పాండెంట్ : **కొర్రిపల్లి వెంకటనారాయణ,** హిందూ, వయస్సు 75 సం॥లు, వ్యవసాయం, పిడుగురాళ్ళ క్యాంప్, పెద్ద అగ్రహారం, గురజాల, గుంటూరు జిల్లా, గురజాల JCJ కోర్టు పరిధి.

పై పిటీషన్‌లో పిటీషనర్ గారు మీ మీద దాఖలు చేసుకున్న ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో మీరు 6వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మీకు శ్రీ కోర్టువారు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా సదరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఆదేశం ప్రకారం మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు గల ఫైనల్ డిక్రీ పిటీషన్ లాట్లు వేయుటకు **ది. 29-11-2023న** వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు గారి ద్వారా గానీ హాజరు అయ్యి పై పిటీషన్‌లో మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల పై పిటీషన్‌లో మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

|| ఇది శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం జారీచేయబడినది ||

పి.వి.ఎస్.ఆర్. మూర్తి, అడ్వకేట్
డో.నెం. 4-2-133, కుచివారి వీధి, పిఠాపురం. సెల్: 9848006149
పిఠాపురం.
ది.21-11-2023

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

గుంటూరు మెయిన్ బ్రాంచి :
గౌరిశంకర్ థియేటర్ రోడ్డు, కొత్తపేట, గుంటూరు.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపిననూ తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **ది. 05-12-2023, మంగళవారం సా॥ 4.00 గంటలకు బ్రాంచి ఆవరణలో బహిరంగవేలం వేయబడును.** వేలం వేసినా బకాయి రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వ. సం.	ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు	స్థూల బరువు (గ్రాములలో)
1.	015030100074668	**జలకం సాంబశివరావు,** తండ్రి : నారాయణ, హెచ్.నెం. 1-23, కోదండరామాలయం వీధి, గుండ్లపల్లి, నకిరేకల్ (మం) గుంటూరు.	7.00

షరతులు : 1) వేలంలో పాల్గొనువారు **రూ. 5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే)** ధరావత్తు చెల్లించవలెను. **2)** వేలంలో ఆభరణములు పొందినవారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో ఆభరణములు పొందని వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. **3)** ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **4)** వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **5)** వేలంలో పాల్గొను వారు ఆధార్ మరియు పాన్‌కార్డు కాపీలను సమకూర్చవలెను.

ది. 21-11-2023 సం/- అధీకృత అధికారి

కుల గణనకు, పథకాలకు సంబంధం లేదు

విజయవంతానికి అందరూ సహకరించాలి : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలో ఈ నెల 27 నుండి డిసెంబర్ 3 వరకు వారం రోజులపాటు చేపట్టనున్న కుల గణనను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని ప్రజా ప్రనిధులు, కులసంఘ నాయకులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్పందన హాలులో ప్రజా ప్రతినిధులు, కుల సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇది కేవలం సంఖ్యా గణన మాత్రమేనని, దీనితో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలకు సంబంధం లేదని అన్నారు. వలస దారులు, ఎక్కడో పనిచేసే వారి వివరాలు సేకరించాలని పలు కుల సంఘాల వారు కోరగా కలెక్టర్ స్పందిస్తూ అందరి వివరాలు సేకరిస్తామన్నారు. వాలంటీరు, ఇంటి పెద్ద, ఫంక్షనల్ అసిస్టెంట్‌ల సమూహా వేలిముద్రల అనంతరం మాత్రమే నమోదు చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కుల గణనను షిఫ్ట్ డ్యూటీలలో నిర్వహించేలా చూడాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఇతర అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ప్రజల వద్ద నుంచి సమగ్ర సమాచారం సేకరించి కులగణన నిర్వహించాలని కులగణన సర్వే ప్రత్యేక అధికారి షమ్మీ అన్నారు. కుల గణన సర్వేపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం శిక్షణిచ్చారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, వైస్‌చైర్మన్ కొమ్ముముక్కంటి హాజరయ్యారు. కార్యక్రమానికి పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ప్రత్యేక అధికారులు మాట్లాడుతూ కులగణన కేవలం ఒక కులం ప్రాతిపదికనే కాకుండా ప్రజల సామాజిక ఆర్థిక వివరాల కోసం నిర్వహిస్తున్నామనే విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. సర్వేలో సచివాలయ సిబ్బంది వాలంటీర్లు కలిసి పని చేయాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్సైట్లో ప్రజల పూర్తి వివరాలు నమోదు చేయాలని అన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, వారికున్న ఆస్తి వివరాలు గతంలో కుల ధ్రువీకరణ పత్రాల వివరాలన్నీ పూర్తిగా వెబ్సైట్లో పొందుపరచాలని చెప్పారు. సర్వేను బిఎల్‌ఒలు పర్యవేక్షించాలన్నారు. 27 నుండి వచ్చేనె 3వ తేదీ వరకూ మాత్రమే సర్వే ఉంటుందని, సర్వేలో సిబ్బందికి ఏమైనా అనుమానాలొస్తే తమ దృష్టికి తేవాలని అన్నారు. సర్వే పనులు కారణంగా చూపి రోజువారి విధులు ఆటంకం కలిగించకూడదని చెప్పారు.

డాక్టర్ సరికొండ రమాదేవికి జాతీయ సాహిత్య కళా శిరోమణి అవార్డు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణానికి చెందిన డాక్టర్ సరికొండ రమాదేవికి జాతీయ సాహిత్య కళా శిరోమణి అవార్డు, బంగారు గజలక్ష్మి పురస్కారాలు లభించాయి ఈ మేరకు ఆదివారం జాతీయ బాలల దినోత్సవాల సందర్భంగా 'గ్రేస్ ఫౌండేషన్ లిటిల్ ఛాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా' ఒంగోలు వారు నిర్వహించిన కార్యక్రములో అధ్యక్షులు కె.బుచ్చేశ్వరరావు, కె.షాలెన్ రాజు, పట్టణ అధ్యక్షులు ఎం.సుబ్బారావు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చుంటి తారకనాథ్, డాక్టర్ ప్రణమా రవి, సినీ నటి కుమారి మన్నే టీనా చౌదరి నుండి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను వారు సత్కరించారు.

నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు సురేష్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ రోడ్డులో గల నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ భాగంలో పనిచేస్తున్న కుందా సురేష్‌బాబుకు పిహెచ్‌డి వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. విఐటి ఏపీ యూనివర్సిటీలో డాక్టర్ వై.నరసింహారావు పర్యవేక్షణలో 'యాన్ ఎఫిసియంట్ అండ్ ఇంటిలిజెంట్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ఫర్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ ఆఫ్ ఇంట్రుషన్ డిటెక్షన్ సిస్టమ్ ఇన్ క్లాస్ ఇంబ్యాలన్సు డేటా సెట్స్' అంశంపై సిద్ధాంత గ్రంధాన్ని సమర్పించినందుకు గాను డాక్టరేట్ దక్కినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి సునీల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతులు ఎస్.ఎన్ తిరుమల, తదితరులు సురేష్‌బాబును సత్కరించారు.

శాస్త్రీయ దక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

విద్యార్థులు శాస్త్రీయ దక్పథాన్ని అలవర్చుకోవాలని పెదకూరపాడు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటరమణ అన్నారు. మంగళవారం సి.వి.రామన్ వర్ధంతిని పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు పరిశీలన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

సూపర్‌వైజర్‌కు అంగన్వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అంగన్వాడి సమస్యల పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 8వ తేదీ నిర్వహించే నిరవధిక సమ్మెలో తామూ పాల్గొంటున్నట్లు అంగన్వాడీలు ప్రకటించారు. ఈ మేరకు నోటీసును పిడుగురాళ్ల ప్రాజెక్టు సూపర్వైజర్ అన్నపూర్ణకు సిఐటియు ఆధ్వర్యంలో మంగళశారం అందించారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారానికి రాకముందు తాను అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే మెరుగైన వేతనాలు పెంచుతానని హామీనిచ్చిన దాన్ని అమలు చేయలేదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటిని వెంటనే అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు టిఎ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. వీటి సాధన కోసం చేపట్టే సమ్మెలో అంగన్వాడీలంతా భాగస్వామం కావాలన్నారు. దీంతోపాటు బుధవారం ఉదయం 10 గంటలకు అంగన్వాడి ప్రాజెక్టు ఆఫీస్ వద్ద ధర్నాని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ జయశ్రీ, శివకుమారి, శాంతి కుమారి పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందిస్తున్న అంగన్వాడీలు

బహుమతి సాధించిన మణికంఠను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ తదితరులు

క్రీడల్లో ఎన్ఆర్ఐ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- మేడికొండూరు

ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన హుస్సేన్

మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్దగల ఎన్ఆర్ఐ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సివిల్ ఇంజినీరింగ్ 4వ సంవత్సరం విద్యార్థి పఠాన్ హుస్సేన్ జేఎన్టీయూకే యూనివర్సిటీ కాకినాడ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో పాల్గొన్న ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎంసీఏలో మొదటి సంవత్సరం విద్యార్థి ఎం.మణికంఠ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. వీరిద్దరి అభినందన సభ కాలేజీలో మంగళవారం నిర్వహించగా ప్రిన్సిపల్ డాక్టర్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కాలేజీలో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల 27వ తేదీ నుంచి జరిగే ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్ మీట్-2023 సంబంధించి ప్రత్యేక శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. కళాశాల ఏవో ఎం.సీతారామయ్య,విభాగాధిపతులు డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ చంద్రమౌళి, పీడీ ఎం.సతీష్, పాలిటెక్నిక్ విభాగ ప్రిన్సిపల్ పులి రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ దాచేపల్లి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - దాచేపల్లి

మండల కేంద్రమైన దాచేపల్లిలోని యుటిఎఫ్ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహారిస్తోందని, సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులంతా ఐక్యంగా పోరాడాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా శేషయ్య, అధ్యక్షులుగా పి.రాజారావు, సహాధ్యక్షులుగా ఎస్‌కె నాగులుమీరా, విఎం రత్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా టి.ఆనంద్‌కుమార్, కోశాధికారిగా జివి శ్రీనివాసరావు మహిళా కార్యదర్శులుగా జి.స్వరూపదేవి, సిహెచ్.వెంకట రమణ, జి.సీత, అదనపు కార్యదర్శిగా యు.సుబ్బలక్ష్మి, సిపిఎస్ కమిటీ అద్యక్షులుగా కొండలు, కన్వీనర్‌గా ఎం.యామినిదేవి ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరావు, శాంతారావ్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

వికిసిత్ భారత్ సంకల్ప యాత్రపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 26 నుండి వచ్చే ఏడాది జనవరి 26 వరకు నిర్వహించనున్న వికిసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీల వారీగా ప్రభుత్వ పథకాలపై సమగ్ర నివేదిక సంబంధిత నమూనాలో పొందుపర్చాలన్నారు. జిల్లాకు కేటాయించిన 4 ఐ.ఈ.సి (ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) ద్వారా అన్ని ప్రాంతాలను 100 శాతం కవర్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ స్థాయి కమిటీలకు పంచాయతి సెక్రెటరి నోడల్ అధికారిగా ఉంటారని, మండల స్థాయిలో ఎంపిడిఒ నోడల్ అధికారిగా, జిల్లా స్థాయిలో జిల్లా పంచాయతి అధికారి మరియు ఉద్యాన వన శాఖాధికారులు నోడల్ అధికారులుగా ఉంటారని వివరించారు. ఆయ గ్రామాల పర్యటనలో అక్కడి కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులను గుర్తించి వారి అనుబవాలను తెలిపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నియోజక వర్గాల వారీగా సరైన ప్రదేశాలను గుర్తించాలని ఆదేశించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరంకుశ మోడి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన

27, 28 తేదీల్లో విజయవాడలో మహా ధర్నాను జయప్రదం చేయాలని విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీలలో విజయ వాడలో మహా ధర్నా జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. మంగళవారం బ్రాడీపేటలోని పిఎల్‌రావు భవన్‌లో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలస కార్మికులకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని, సామాజిక భద్రత అందించాలని, కేరళ మాదిరిగా వ్యవసాయ కూలీలకు రోజువారి వేతనం రూ.600 రూపాయలకు పెంచి పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని, ధరల పెరుగుదలను నియంత్రించి నిత్యావసరాలపై జీఎస్టీని తగ్గించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికం, చేసి ఆహార భద్రతకు, ఉచిత విద్య, వైద్యం, నీరు, పారిశుధ్య హక్కుకు హామీ ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ అన్ని పంటలకు 50 శాతం కలిపి కనీస మద్దతు ధరను నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించాలని, స్కేల్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా రైతు రుణ ఉపశమన చట్టంలో పార్లమెంట్‌లో

గుంటూరు సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

తాడేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

ఆమోదించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని ఉపసంహరించాలని, సమగ్ర ప్రభుత్వ రంగ పంటల బీమా సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. రద్దు చేసిన కార్మికుల నాలుగు లేబర్ కోడ్‌లను పునరుద్ధరించాలని, అసంఘటితరంగా కార్మికులకు పెన్షన్, సామాజిక భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో జరిగే మహాధర్నాలో వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అధ్యక్షత వహించగా, జిల్లా ఉపాధ్యక్షులు బి.కోటేశ్వరి, నాయకులు శివయ్య, పి.అప్పారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్న బిజెపి విధానాలను నిరసించాలని రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు అన్నారు. బిజెపి హయాంలో దేశంలో మైనార్టీలు, దళితులపై దాడులు పెరిగిపోయానని ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు ప్రజలు ఆస్వాదించే క్రికెట్‌కు కూడా మతం రంగు పులమడాన్ని తప్పుబట్టారు. బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే మహాధర్నాలో రైతులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు డి.వెంకటరెడ్డి, ఎస్ నాగేశ్వరరావు, డి.సామ్యేలు, టి.వెంకటయ్య, ప్రజా సంఘాల నాయకులు ఎస్.ముత్యాలరావు, డివి భాస్కరరెడ్డి, వై.బర్నబస్, దశరథరామిరెడ్డి, ఎన్.దుర్గారావు, కె.వెంకటయ్య, పి.లక్ష్మణరావు, కామాక్షి పాల్గొన్నారు. అనంతరం బోసుబొమ్మ సెంటర్‌లో మహాధర్నా బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

8వ తేదీ నుండి అంగన్వాడీల నిరవధిక సమ్మె

కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై నేతాజీ మాట్లాడుతూ అంగన్వాడీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాడిని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిష్కరించకపోతే డిసెంబర్ 8వ తేదీ నుండి నిరవధిక సమ్మె లోకి అంగన్వాడీ వెళ్తున్నారని అన్నారు. ఈ సమ్మెలో అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనం పెంచాలని, తక్షణమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటి రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షల రూపాయలకు పెంచాలని, పెండింగ్లో ఉన్న అద్దె సెంటర్లను ఇవ్వాలని, 2017 నుండి టీఏ ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఆఖరి వేతనంలో 50% పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ అధికారి సులోచనకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సరళ, కిరణ్మయి, హేమలత, సుహాసిని, జయ, పూర్ణిమ, తిరుపతమ్మ, కోటేశ్వరమ్మ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ :అంగన్వాడి అక్క చెల్లెమ్మలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీని వెంటనే నిలబెట్టుకోవాలని, లేకపోతే డిసెంబరు 8 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ తెలిపారు. సోమ వారం పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో మండల అధ్యక్షులు శివ పార్వతి అధ్యక్షత జరిగిన అంగన్వాడీ యూనియన్ విస్తృత సమావేశంలో నేతాజీ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వర రావు , యూనియన్ మండల కార్యదర్శి శ్రీదేవి నాయకులు ధనలక్ష్మి , రమ, పద్మ ,సైదాని పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : తమ కోర్కెలు సాధనకు ప్రభుత్వానికి పలుమార్లు సంప్రదింపులు జరిపినా ఎటువంటి మార్పు రానందున నిరవధిక సమ్మె నిర్వహిస్తామని యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి తెలిపారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో తెనాలి ఐసిడిఎస్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వి.ధనలక్ష్మికి సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ వలి, రంగపుష్ప, రాధిక, హేమలత, కే జ్యోతి విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో పొన్నూరు ఐసిడిఎస్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు సుకన్య, కార్యదర్శి రత్న మంజుల, చేబ్రోలు నాయకులు రాధా, పెదకాకాని కనకవల్లి, కృష్ణకుమారి, ఏ అనురాధ, డి పద్మజ పాల్గొన్నారు.

మంగళగిరిలో ఐసిడిఎస్ అధికారి సులోచనకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

పొన్నూరులో..

తెనాలిలో..

పెదనందిపాడు సమావేశంలో మాట్లాడుతున్న వై నేతాజీ

స్వధార్ హోంలో యాంటీబయోటిక్ డే

ప్రజాశక్తి- తెనాలి : యాంటిబయోటిక్ డే ను పురస్కరించుకుని మంగళవారం జెఎంజె సంస్థ నిర్వహణలోని స్వధార్ హెూంలో తలదాచుకుంటున్న చిన్నారులు, మహిళలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ, పట్టణానికి చెందిన హ్యాపీ హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తయంగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. స్వధార హోం లో వారిని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కార్యదర్శి ముమ్మనేని భానుమతి మాట్లాడుతూ రెడ్ క్రాస్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా స్వదార కేంద్రంలో ఏదైనా అవసరమయితే తమను సంప్రదించాల్సిందిగా కోరారు. హ్యాపీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పవని ప్రియాంక మాట్లాడుతూ హోంలో మహిళలు, చిన్నారులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిం చారు. అవసరమైతే తమ వైద్యశాలలో సంప్రదించాలన్నారు. ప్రియదర్శిని కళాశాల హెచ్ఓడి లావణ్య తమ జన్మదినోత్సవాన్ని స్వధార్ హోంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో అఖిల్, రాజు నాయక్, చందన ప్రియ, కళ్యాణి హ్యాపీ హాస్పిటల్ స్టాఫ్ సాంబయ్య, నందు, స్వదార హోం నిర్వాకులు, రెడ్ క్రాస్ కోశాధికారి నాళ శ్రీమన్నారాయణ మూర్తి పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ పవని ప్రియాంక

జాతీయ స్థాయి పోటీలకు వెనిగండ్ల జడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

వెనిగండ్ల జడ్‌పి పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నంబూరు తిరుపతి రావు మంగళవారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అంతర్ జిల్లాలో పోటీల్లో అండర్ 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి మున్నంగి సుబ్బారెడ్డి, బాలికల విభాగంలో 7వ తరగతి చదువుతున్న బోడపాటి ప్రవస్థి నేషనల్స్‌కి ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ నాగజ్యోతి, కమిటీ సభ్యులు సిహెచ్. వెంకటేశ్వరరావు, ప్రేమసాగర్. వ్యాయామ ఉపాధ్యాయులు మస్తాన్ రెడ్డి, చంటిబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.

మంగళగిరిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పీఈపీయల్ కార్యాలయంలో మంగళవారం పీఈపీయల్ అధినేత పితాళ్ళ మస్తాన్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని. పీఈపీయల్, విజయవాడ-గుంటూరు రెయిన్బో బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా పీఈపీయల్ అధినేత పితాళ్ళ మస్తాన్ రావు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉడతా రాజశేఖర్, దామర్ల తారకనాథ్, ప్రగడ శ్రీను, మల్లూరి మహేష్, కటారి శ్రీనివాసరావు, తోట శ్యామ్ కుమార్, బి నాగ సత్యనారాయణ, ఎం వెంకటరమణ, కే వెంకటేశ్వరరావు, ఐ నాగరాజు, ఎం దుర్గా శంకర్ పాల్గొన్నారు.

ఆర్ విఆర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆర్‌విఆర్‌లో సందడిగా 'కార్తీక శోభ' కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

పండుగలు భారతీయ సంస్కృతికి ప్రతిరూపాలని ఆర్‌విఆర్ అండ్ జె.సి. ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భారతదేశ సంస్కతి, సాంప్రదాయాల పై సజనాత్మకతను పెంపొందించేందుకు మంగళవారం కళాశాల ఉమెన్స్ వెల్ఫేర్ కమిటి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తెలుగు సాంప్రదాయ పద్ధతిలో విద్యార్థినిలు నూతన పట్టు వస్త్రాలతో, కులమతాలకు అతీతంగా భారీ సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పూల అలంకరణలతో, రంగులతో వేసిన ముగ్గులు, దీపాలంకరణలు ప్రేత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఉమెన్స్ వెల్ఫేర్ కమిటి కన్వీనర్ డాక్టర్ సుధావాణి పర్యవేక్షించారు.

బీసీలకు వైసిపి ద్రోహం : టిడిపి

మాట్లాడుతున్న డాక్టర్ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బీసీలకు రాజకీయంగా తోడ్పాటు అందించడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధి టిడిపి ద్వారా సాధ్యమైందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. 'బిసిలకు వైసిపి ద్రోహంపై ఐక్య పోరాటం' పేరుతో నరసరావుపేట పట్టణంలోని జమీందారీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీ గౌరవ అధ్యక్షులుగా, బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి పర్యవేక్షకులుగా, పల్నాడు బీసీ సెల్ అధ్యక్షులు మున్నా రాంబాబు అధ్యక్షునిగా వ్యవహరించారు. డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ బీసీలకు వైసిపి పాలనలో జరిగినంత ద్రోహం, దగా, దాడులు, అరాచకాలు, హత్యలు బ్రిటీష్ పాలనలో కూడా జరగలేతన్నారు. బీసీలు బిక్కుబిక్కుమంటూ బతికే పరిస్థితి కల్పించారన్నారు. వాలంటీర్లతో వేధింపులకు పాల్పడే వైసిపికి బీసీల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులివ్వలేదని 56 కార్పొరేషన్లు ఎవరి కోసం ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. అక్రమ కేసులు పెట్టి బీసీలను దగా చేసే వైసిపిని ఓడించేందుకు బీసీలంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ వైసిపి పాలనలో సామాజిక న్యాయం లేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చిందని, వైసిపి పాలనలో సలహాదారులు, యూనివర్శిటీ వీసీలు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లలో బీసీలకు ఎందుకు అవకాశాలు తగ్గించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో నరసరావుపేట నియోజకవర్గ బీసీ అభ్యర్థి అరవిందబాబును గెలిపించాలని కోరారు. టిడిపి క్రమశిక్షణా సంఘం సభ్యులు జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు చెందిన దాదాపు 30 సంక్షేమ పథకాలు రద్దు చేశారని, బీసీలకు రిజర్వేషన్లు కుదించి రాజకీయంగా అణగదొక్కారన్నారని విమర్శించారు. వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ వైసిపి పాలనలో 74 మంది బీసీలను హత్య చేశారని, వేలాది మందిపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని అన్నారు. సమావేశంలో వివిధ సంఘాలు, జనసేన పార్టీ నాయకులు పాల్గొనగా బీసీలకు జరిగిన అన్యాయం, దాడులు, హత్యలుకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

ఓట్ల తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి - పెదకూరపాడు

మా ఓట్లు తొలగించారని అమరావతి మండలంలోని అత్తలూరు, ఉంగుటూరు గ్రామాలకు చెందిన మహిళలు, టిడిపి నాయకులు పెదకూరపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఓట్ల నమోదు అధికారి నాగజ్యోతి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించిన నేపథ్యంలో మహిళలు ఈ ఆందోళన చేపట్టారు. అనంతరం నాగజ్యోతికి పత్రాన్ని ఇచ్చారు. టిడిపి నాయకులు రమేష, జానీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫారం -7 దుర్వినియోగంపై టిడిపి ఫిర్యాదు



ప్రజాశక్తి-ఈపూరు

ఫారం-7 దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కోరారు. ఎన్నికల నియమ నిబంధనలను అతిక్రమించి ఫారం 7 ద్వారా ఓటర్లను తొలగించే ప్రక్రియ జరుగుతోందని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఎ.ముప్పాళ్లలో 170 దరఖాస్తులు ఇద్దరు వ్యక్తులు పెట్టారన్నారు. ఒక వ్యక్తి ఫారం-7 ఐదు దరఖాస్తులు మాత్రమే పెట్టాల్సి ఉంటుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బి.బాబురావు, జి.వీరాంజనేయులు, కె.కోటేశ్వరరావు, బి.సైదులు, సిహెచ్.మల్లయ్య, ఎం.శీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక

బాలలే జాతీయ సంపద

ప్రజాశక్తి - వినుకొండ

బాలలు జాతీయ సంపదని, వారి హక్కులను కాపాడడం అందరి బాధ్యతనే పిలుపుతో నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా మండలంలోని పెద్దకంచర్ల జెడ్‌పి పాఠశాలలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి గ్రేడ్ వన్ సూపర్వైజర్ శ్రీలత, అధ్యక్షత వహించగా సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల వడంబడిక ప్రకారం బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, బాలలకు కల్పించారని వివరించారు. సోషల్ మీడియాను ఉపయోగించేటప్పుడు పెద్దలు జాగ్రత్తగా ఉండాలని, పిల్లలను వీటికి దూరంగా ఉంచాలని సూచించారు. బాల్య వివాహాలు అరికట్టాలని, అందరూ చదువుకోవాలని అన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

మత్స్యకారులకు వాహనాలను అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మత్స్యకారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఒఎన్‌జిసి పైప్‌లైన్ ఏర్పాటులో నష్టపోయిన మత్స్యకారులకు జాతీయ మత్స్యదినోత్సవం సందర్భంగా ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోనితన క్యాంప్ కార్యాలయం నుండి మంగళవారం జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే, లబ్ధిదారులు నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదార్లతో కలెక్టర్ మాట్లాడి రాయితీ వివరాలు, వ్యాపారం జరుగుతున్న తీరు, ఆదాయం, మార్కెటింగ్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాపారంలో ఉదాసీనత, అలసత్వం ఉండకూడదన్నారు. సకాలంలో స్పందించే తత్త్వం అలవర్చుకోవాలని చెప్పారు. బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు మరికొంత రుణం ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ పథకాల వినియోగంలో బినామీలు ఉండకూదని, అలా చేసినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ఐషర్ వాహనన్ని, 5 ద్విచక్ర వాహనాలను అందజేశారు.

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - వినుకొండ : కార్తీక మాసం సందర్భంగా పంచారామాలు, త్రిశైవ క్షేత్రాలు, శబరిమలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందని డిపో మేనేజర్ బి. కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఈ నెల 26, వచ్చేనెల 3, 10 తేదీల్లో పంచారామలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతికి, రాత్రి 10 గంటలకు బస్సులు బయలుదేరి మరుసటి రోజు ఉదయం పంచారామాలు దర్శించు కొని అదేరోజు సాయంత్రంనకు తిరిగి వినుకొండకు చేరుకుంటాయని చెప్పారు. ఒకేరోజులో శ్రీశైలం, మహానంది, యాగంటి త్రిశైవాక్షేత్ర దర్శనం చేసుకోవచ్చన్నారు. అరుణాచలానికి ప్రతినెలా పౌర్ణమి రోజున ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. పంచారామాలకు అల్ట్రా డీలక్స్ రూ.1450, అరుణాచలానికి సూపర్ లగ్జరీ రూ.2550గా టిక్కెట్ ధర నిర్ణయించామని తెలిపారు. అయ్యప్ప స్వాములకు తక్కువ ధరల్లో స్పెషల్ ప్యాకేజీ బస్సులు ఏర్పాటు చేస్తామని, ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉందని వివరించారు. మరిన్ని వివరాలకు 7382896046, 9959225431 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చింతల తండాలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాచర్ల మండలం చింతలతండాలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఎంపిపి బి.మంగమ్మ కుమారుడు శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మల్లుస్వామి, సర్పంచ్ శ్రీను నాయక్, ఎంపిటిసి సీత నాయక్, ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకందారుల సొసైటీ చైర్మన్ బూడిద సైదులు, జగనన్న సురక్ష కన్వీనర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా షేక్ బాజీ

ప్రజాశక్తి - నాదెండ్ల : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా షేక్ బాజీ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ నుండి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - వినుకొండ : వినుకొండ శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానానికి కొండమీద దేవాలయ పునరుద్ధరణలో భాగంగా మున్సిపల్ చైర్మన్ షకీలా దస్తగిరి కుటుంబ సభ్యులు రూ.3.50 లక్షలను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు అభివృద్ధి, సేవా సంఘాలనికి ఈ మొత్తాన్ని మంగళవారం అందించారు.

జీవీ.. అవన్నీ ఎందుకు చేయలేదు : ఎమ్మెల్యే

కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

తాను అభివృద్ధి చేశాను కాబట్టే ప్రజల ముందు ధైర్యంగా రాగలిగానని, పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి లేదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. పట్టణంలోని 32వ వార్డు విష్ణుకుండి నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో విష్ణుకుండి నగర్‌లో తాగునీటికి ప్రజలు అల్లాడారని, ట్యాంకర్ల ద్వారా నీరిచ్చారని చెప్పారు. కాల్వకట్ట రోడ్లపై కంపచెట్లు పెరిగి చనిపోయిన జంతువుల్ని వేయడం వల్ల విష్ణుకుండి నగర్‌కు దుర్వాసన వచ్చేదని ఇప్పుడా పరిస్థితి లేదని అన్నారు. గాయత్రి నగర్‌లో చెరువునూ అభివృద్ధి చేశామన్నారు. టిడిపి అధికారంలో ఉండగా ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు పట్టణంలో తాగునీటి సమస్యను ఎందుకు పరిష్కరించలేదని, ఘాట్ రోడ్ నిర్మాణం ఎందుకు చేపట్టలేదని, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని ఎందుకు నిర్మించ లేదని, గిరి ప్రదక్షిణ రోడ్డు ఎందుకు నిర్మించలేదని, వంద పడకల ఆసుపత్రి ఎందుకు నిర్మించలేదని, స్టేడియం ఎందుకు నిర్మించలేదని, కూరగాయల మార్కెట్, రైల్వే అండర్ ప్రొసెస్ బ్రిడ్జి ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు.

బొల్లా ఇక్కడి నుండే పోటీ చేయాలి : జీవీ

కరపత్రాలు ఇస్తున్న జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ నుంచి మళ్లీ బొల్లా బ్రహ్మనాయుడు పోటీ చేయాలనేదే తన కోరికని, ఆయన్ను బంగాళాఖాతంలో కలిపేందుకు వైసిపి నాయకులు కూడా తహతహ లాడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు దుయ్యబట్టారు. బొల్లాపల్లి మండలంలోని లక్ష్మీపురం తండా, మాలపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా జీవీ ఆంజనేయులు పాల్గొని టిడిపి, జనసేన ఉమ్మడిగా రూపొందించిన కరపత్రాలను స్థానికులకు అందించారు. బొల్లా బ్రహ్మనాయుడు పాల్పడిన అవినీతి, మోసాలు, జాలలపాలెం వద్ద ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దాన్ని ప్రభుత్వానికే రూ.18 కోట్లకు అమ్మిన వైనం అంతా ప్రజలకు తెలుసన్నారు. ఒక్క బొల్లాపల్లి మండలంలోనే పట్టాదారు పాస్ పుస్తకాలు తహశీల్దార్‌ను అడ్డం పెట్టుకొని రూ.10 కోట్లకు పైగా కొట్టేశారని ఆరోపించారు. టిడిపి హయాంలో వచ్చిన నిధులు తప్ప ప్రత్యేక నిధులు ఒక్క రూపాయి తీసుకురాక పోగా తాను తెచ్చిన రూ.159 కోట్లతో వినుకొండ తాగునీటి స్కీమ్ పూర్తి చేయలేదన్నారు. తంగిరాల డాం నిర్మిస్తానని ప్రగల్బాలు పలికారని, ఆయనకు మరో అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని భూకబ్జాల అడ్డగా చేసుకుంటారనే భయం ప్రజల్లో ఉందని అన్నారు.

అన్యాయాన్ని ఎదిరించే తత్వం అలవరచుకోండి

దిశ యాప్ పై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

ప్రజాశక్తి - తుళ్లూరు

బాల బాలికలు అన్యాయాన్ని ఎదిరించే తత్వాన్ని అలవరచు కోవాలని తుళ్లూరు సిఐ ఎం ఆనందరావు చెప్పారు.మంగళవారం స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాలులో మంగళగిరి గుడ్ షెపర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాలికలు తమపై జరిగే దౌర్జన్యాలు, దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలని, కుటుంబ పరువు పోతుందని భయపడితే ఆకతాయిలు మరింత పెట్రేగి పోయే ప్రమాదం ఉందన్నారు. బాలలు, మహిళల రక్షణకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత నిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా దిశా యాప్ గురించి మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. ఎంపీడీవో బి శివన్నారాయణ మాట్లాడుతూ బాలలందరూ చక్కగా చదువుకుంటూ క్రమశిక్షణతో ఉన్నత స్థానాలను చేరుకోవాలని చెప్పారు. తహశీల్దార్ కె కళ్యాణి మాట్లాడుతూ, బాల బాలికలందరూ చదువుతోపాటు ఇతర రంగాలపై కూడా దృష్టి సారించాలని చెప్పారు. తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను గౌరవించాలని చెప్పారు. హైకోర్టు అడ్వకేట్ ఎం హృదయ రాజు మాట్లాడుతూ బాలలకు కూడా హక్కులు ఉంటాయని వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉంటుందని అన్నారు. ఎ పి ఎం చిన్న వీరయ్య మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో బాలలందరూ రకరకాల ప్రతికూల ప్రభావాలకు గురవుతున్నారని, సోషల్ మీడియా ప్రభావం రోజురోజుకీ ఎక్కువ అవుతుందని చెప్పారు సిడిపిఓ ప్రసూన మాట్లాడుతూ,ప్రస్తుత సమాజంలో కూడా బాల్యవివాహాలు,చైల్డ్ లేబర్,స్కూల్ డ్రాప్ అవుట్ మొదలైన సమస్యలు ఇంకా ఉన్నాయని వాటిని రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ ఉదయ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో తమ వంతుగా పనిచేస్తున్నామని బాలలకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్నా తమ వద్దకు తీసుకువస్తే తగిన పరిష్కార మార్గాలు చూపిస్తామని చెప్పారు. తొలుత అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ బ్రోచర్ ను ఆవిష్కరించారు.

తాడేపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పర్యటించారు. పలు సమస్యలపై అధికారులతో చర్చించారు. ఆంధ్ర రత్న పంపింగ్ స్కీమ్ కాలువను పరిశీలించారు. అక్కడ నుండి కనకదుర్గ వారధి, కరకట్ట వరకు మంచినీటి సరఫరాపై అధికారులతో చర్చించారు. సిఎస్ఆర్ కల్యాణ మండపం ప్రాంతంలో అపార్టుమెంట్ల నుంచి వస్తున్న మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి కమిషనర్ నిర్మల్‌కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి, ఎం.వివేకానందరెడ్డి, ఇ.డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ కోసం రెండో రోజు దీక్ష

.ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగింపు పనులకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ పెదనందిపాడులో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రెండవ రోజు రైతుల నిరసన దీక్ష జరిగింది. ఈ శిబిరంలో నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజ మోహన్ రావు మాట్లాడుతూ గుంటూరు చానల్ పర్చూరు వరకు పొడిగింపు విషయంలో నిధులు లేక ఆగిపోయిన పనుల కు ప్రభుత్వం వెంటనే నిధులు సమకూర్చి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 50వేల ఎకరాలకు సాగునీరు 50 గ్రామాలకు తాగునీరు అందజేసి ఈ ప్రాంత ప్రజలను రైతాంగాన్ని ఆదుకోవాలని డాక్టర్ కొల్లారాజ మోహన్ రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం దీక్షలో లావు చౌదేశ్వరి, దివ్వి ప్రమీల, కొమ్మినేని రత్నకుమారి, లావు చిట్టెమ్మ, మొవ్వ అమరేశ్వరి, బోడావుల కష్ణకుమారి, కొల్లా సంపూర్ణమ్మ, కొల్లా చిట్టీమ్మ,ఆలూరి దేవకీదేవి, తుమ్మల సరళ దేవి, వే లినేని సునీత, రావి శివరామకష్ణయ్య, ధూళిపాళ్ల మోహన్ రావు, బోడావుల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 27 నుంచి కులగణన సర్వే ప్రారంభం

మాట్లాడుతున్న డిపివో శ్రీదేవి

ప్రజాశక్తి-తెనాలి

ఈనెల 17 నుంచి కులగణన సర్వే ప్రారంభమౌతుందని తహశీల్దార్ పి.రత్నం చెప్పారు. పెదకాకాని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మంగళవారం కులగణనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరి వివరాలు సేకరిస్తారన్నారు. సర్వేలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు, తదితర వివరాలు సేకరిస్తారన్నారు. కులగణన సర్వేకు ప్రజలు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. సమావేశంలో ఎంపిడివో, జెడ్పీటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారిణి కె.శ్రీదేవి కోరారు. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షతన కులగణనపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గణాంకాలను సేకరించే విదానాన్ని సోదాహరణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకునేందుకు సర్వే జరుగుతుందన్నారు. వార్డు వాలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికి తిరిగి సమాచారం సేకరిస్తారన్నారు. పట్టణంలోని 47 వార్డు సచివాలయాల పరిధిలో ఈనెల 27 నుంచి కులగణన సర్వే ప్రారంభమౌతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడివో ఎల్ విజయాలక్ష్మణ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ 1, 2 జడ్ సుధాకర్, ఎల్ఎస్ సుబ్బారావు, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ-1 లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యాశాఖలో అమలు చేయబోయే వార్షిక ప్రణాళికలు విద్యాహక్కు చట్టం-2009 నూతన జాతీయ విద్యావిధానం-2020 సంవత్సరానికి అనుగుణంగా లక్ష్యాలను చేరుకునేలా రూపొందించాలని మండల వైద్యా శాఖాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం బుర్రిపాలెం రోడ్డు మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఇఒ తో పాటు ఎంఇఒ-2 జయంతి బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాల అభివృద్ధి ప్రణాళికతో పాటు హ్యాబిటేషన్ ప్లాన్స్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వార్షిక బడ్జెట్ ప్రణాళికలో 2024-25, 2025-26 ఖచ్చితమైన డేటాను పొందుపరచాలని అన్నారు. పాఠశాల స్థాయిలో సమగ్ర వివరాలను పొందుపరచడంతోపాటు తల్లితండ్రుల సమావేశం నిర్వహించి హ్యాబిటేషన్ ప్లాన్,కాంప్లెక్స్ స్కూల్ ప్లాన్ లను సిద్ధం చేయాలన్నారు. పాఠశాల స్థాయిలో పూర్తిచేసిన డేటా మొత్తాన్ని క్రోడీకరించి మండల ప్లాన్ నవంబర్ 30 నాటికి జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ అర్బన్ రూరల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 60 మందికి కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి

మహిళలు ఆర్థికంగా ఎదగలనేదే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ లక్ష్యమని మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి అన్నారు. స్త్రీ శక్తి ద్వారా మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాల్లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్ లో మంగళవారం నియోజకవర్గ తెలుగు మహిళలు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 33వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 60 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, మంగళగిరి నియోజకవర్గం తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, మంగళగిరి మండల తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి అప్పల శాంతి, మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఎలమంచిలి పద్మజ, మంగళగిరి పట్టణ తెలుగు మహిళ కార్యదర్శి సింహాద్రి బేబీ రాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ రాధికను సత్కరిస్తున్న పచివాలయ బృందం

చైర్‌పర్సన్‌ను సత్కరించిన సచివాలయ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-తెనాలి

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన తాడిబోయిన రాధికను ఏపి గ్రామ వార్డు సచివాలయ ఉదోగ సంఘం నాయకులు సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శేషుబాబు ఆధ్వర్యంలో స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా చైర్‌పర్సన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె విధి నిర్వహణపై వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపిజిడబ్ల్యూఎస్ ఎంప్లాయీస్ తెనాలి అధ్యక్షులు ఎ.నాగార్జున, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు ఎస్‌కె బహ బూబున్నీసా, నాయకులు ఎల్ ఏడుకొండలు, పి.భాస్కర్, వీరేంద్రప్రసాద్, తిరుపతిరావు, ఆశాదీప్ పాల్గొన్నారు.

25న 'పైనాపిల్ జామ్ కథలు' పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ విద్యావేత్త, రచయిత, సాహితి వేత్త డాక్టర్ విజయ్ కోగంటి కలం నుండి జాలువారిన మరో ఆణిముత్యం 'పైనాపిల్ జామ్' కథలు పుస్తకాన్ని స్థానిక అరండల్ పేట అవగాహన సంస్థ కార్యాలయంలో ఈనెల 25న సాయంత్రం ఆవిష్కరిస్తున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. అవగాహన సామాజిక సాంస్కృతిక సంస్థ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అలాగే ప్రముఖ సాహితీవేత్త కాట్రగడ్డ దయానంద్ పుస్తక సమీక్ష చేస్తారని, రావెల సాంబశివరావు, పెనుమాక నాగేశ్వరరావు పుస్తకంలో కథలపై విశ్లేషిస్తారని చెప్పారు. నగరంలోని కథా రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యా భిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా లక్ష్మీనారాయణ కోరారు.

నెఫ్రో ఐసియు స్థానంలో న్యూరో సర్జరీ

అందుబాటులో రానున్న 20 పడకలు : డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వార్డును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

ప్రభుత్వ ఆసుపత్రిలో నెఫ్రో ఐ సి యు ను న్యూరో సర్జరీ ఐ సి యు వార్డుగా మారుస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం నెఫ్రో ఐ సి యూ ను ఆయన పరిశీలించారు. ఈ వార్డు మార్పు చేర్పుల పై డాక్టర్ కిరణ్ కుమార్ మీడియా తో మాట్లాడారు. నెఫ్రో ఐ సి యూ ను పాత భవనం లోకి నూతనంగా ఏర్పాటు చేసిన నెఫ్రో వార్డులోకి మార్చినట్లు, ఈ వార్డు లో 20 పడకలను న్యూరో సర్జరీ కి కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు. అందుకు అవసరమైన పనులను చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పం తో ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ఆయన అన్నారు. న్యూరో సర్జరీకి వచ్చేది తలకు గాయాలైన వారు ప్రమాదం అంచున ఉన్నవారు వస్తుంటారని అలాంటి వారికి చికిత్స చేయాలంటే ప్రైవేట్ ఆసుపత్రిలో కనీసం రోజుకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం అన్ని ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని వివరించారు. న్యూరో సర్జరీ వార్డు ఆపరేషన్ థియేటర్ లకు, బ్లడ్ బ్యాంక్‌కు అందుబాటులో ఉంటుందని ఆయన అన్నారు. దీనివల్ల రోగులకు సత్వరమే వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని అయన అన్నారు. న్యూరో సర్జరీ హెచ్ ఓ డి డాక్టర్ సత్యనారాయణ మూర్తి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ యమ ఓ డాక్టర్ సతిష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ రోజని పాల్గొన్నారు.

చలపతి అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో సిఎస్ఐటి విభాగానికి చెందిన చప్పాల రమాదేవికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ తెలిపారు. రమాదేవి ఏఎన్‌యులో ప్రొఫెసర్ ఇ.శ్రీనివాసరెడ్డి మార్గదర్శకత్వంలో 'కన్‌జెషన్ కంట్రోల్ మెకానిజమ్స్ ఇన్ ఐపివి6 రూటింగ్ ప్రోటోకాల్ ఫర్‌లో పవర్ లాసి నెట్‌వర్క్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా రమాదేవికి చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, సెక్రెటరీ, కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ అభినందించారు.

ఎమ్‌టిఎమ్‌సి అధికారులతో జెసి రాజకుమారి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి మంగళవారం మంగళగిరి - తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్‌కు స్పెషల్ ఆఫీసర్ హోదాలో ఎంటిఎంసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. కార్పొరేషన్ పరిధిలో జరుగు తున్న అభివృద్ధి పనుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఎటువంటి అలసత్వం చూపవద్దని అధికారులకు తెలియజేశారు. తుది ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు ఉండకుండా ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేయాలని, జంక్ క్యారెక్టర్లు లేకుండా చూడాలని, ఒకే డోరు నెంబరు గల ఇంటిలో ఎక్కువ ఓటర్లు వున్న ఓటర్లను గుర్తించి నోషనల్ హౌస్ నంబరు కేటాయించాలని చెప్పారు. బిఎల్‌ఒలు, సూపర్వైజర్ లెవెల్‌లో క్షుణ్ణంగా ఓటర్ల జాబితాను సరిచూసి తుది ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. అలాగే ఎంటిఎంసి పరిధిలోని కొన్ని ఓటరు నమోదు క్లెయిమ్‌లను స్వయంగా జిల్లా సంయుక్త కలెక్టరు పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంటిఎంసి కమిషనర్, అడిషనల్ కమిషనర్, అసెంబ్లీ నియోజకవర్గ తహశీల్దార్లు హాజరయ్యారు.

ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాలకు అరుదైన గుర్తింపు

దేశస్థాయిలో 34, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి-తెనాలి

ప్రిన్సిపల్ రాంచంద్‌ను సత్కరిస్తున్న చైర్మన్ శివకుమార్

పట్టణంలోని అన్నాబత్తుని సత్యనారాయణ డిగ్రీ కళాశాలకు అరుదైన గౌరవం అభించింది. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం కళాశాలలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల గోవాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఏఐసిటిఈ ప్రతినిధి బృందం నిర్వహించిన సమావేశంలో దేశస్థాయిలో ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలకు 34వ ర్యాంకు, అలాగే రాష్ట్ర స్థాయిలో, సౌత్ ఇండియా స్థాయిలో ప్రథమ స్థానం లభించింది. ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్సులో కూడా స్థానం లబించినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 36 సంవత్సరాల ప్రయాణంలో లభించిన గుర్తింపు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రాప్యారిస్‌గా గుర్తింపు పొందిన తెనాలికే గర్వకారణంగా విద్యాసంస్థలు విలసిల్లుతున్నాయన్నారు. డెల్టా ప్రాంతంలో ఎంతో మందికి ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తూ, ప్రతిఏటా కనీసం రెండు వేల మందికి క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. మారుతున్న విద్యాప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులను ఎప్పటికప్పుడు తీర్చిదిద్దుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాంచంద్ అంకిత భావాన్ని అభినందించి సత్కరించారు. క్రమశిక్షణకు, నాణ్యతాప్రమాణాలతో కూడిన విద్యకు చిరునామాగా ఉన్న కళాశాలలో విద్య, ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చేపల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మంగళవారం మత్స్యకార దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నగరపాలక సంస్థ పరిధిలో చేపలు విక్రయించే మత్స్యకార మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకార మహిళలు గుంటూరు నగరంలో ప్రస్తుతం వున్న వెన్‌లాక్ మార్కెట్‌లో చేపలు విక్రయించుకోవడానికి అసౌకర్యంగా వుందని, ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరగట్లేదని, చేపలు విక్రయించి జీవనోపాధి పొందే మత్స్యకార కుటుంబాలు పెరిగినందున నగర పరిధిలో విశాలమైన ప్రాంతంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా వివిధ సాంకేతిక కారణాల వల్ల మత్స్యకార పెన్షన్లు అందట్లేదని, వాటిని సక్రమంగా మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మత్స్యకార మహిళలు తెలిపిన అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి చేపల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. చేపల విక్రయాలపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాల వివరాలను, చేపల మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాలపై నగరపాలక సంస్థ అధికారులను సమన్వయం చేసుకొంటూ వెంటనే ప్రతిపాదనలు అందించాలని మత్స్య శాఖాధి కారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అర్హత వున్న మత్స్యకారులకు పెన్షన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖాధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖాధికారి గాలి దేముడు, మత్స్య శాఖ అభివృద్ధి అధికారులు , మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రపంచ చేపల దినోత్సవం నిర్వహించారు. జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ప్రొఫెసర్ కే. సునీత అధ్యక్షత వహించారు. అనంతరం చేపల పెంపకం, చేపల వినియోగం వంటి అంశాలపై విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. చేపలు తినడం వల్ల కలిగే లాభాలు, చేపల పెంపకానికి అనుకూలమైన ప్రాంతాలు, చేపల పెంపకంలో మెలకువలు వంటి అంశాలను విద్యార్థులకు విశదీకరించారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ కే. వీరయ్య, ప్రొఫెసర్ జి. సింహాచలం, ప్రొఫెసర్ పి. పద్మావతి, ప్రొఫెసర్ వి . వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :మత్స్య సంపద అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దీని ద్వారా మత్స్యకారుల ఆదాయ వనరులు పెంచడానికి కృషి చేస్తున్నామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అన్నారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రకాశం బ్యారేజీ వద్ద 17 లక్షల చేప పిల్లలను మొదటి విడతగా కృష్ణానదిలోకి విడుదల చేశారు. ఈ ఏడాది 25 లక్షల చేప పిల్లలను కృష్ణానదిలోకి వదలడానికి లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మత్స్య సంపద విలువైనదని, మత్స్య ఆహారం కూడా పౌష్టికరమైనదని డబ్ల్యుహెచ్ఒ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు నాణ్యమైన చేప ఉత్పత్తులను అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. సిఎం జగన్ మత్స్యకారుల సంక్షేమ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వేట సమయంలో దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురై మరణించిన మత్స్యకార కుటుంబాలకు రూ.10 లక్షల సాయం అందించేందుకు ప్రభుత్వం మత్స్యకార బీమాను ప్రవేశపెట్టిందని చెప్పారు. 50 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు రూ.2750 పించను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రరావు, జిల్లా మత్స్యశాఖ అధికారులు దేవుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, తహశీల్దార్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలోకి చేప పిల్లలను వదులుతున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

దూరవిద్య డిగ్రీ కోర్సుల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కేంద్రం ఆగస్టులో నిర్వహించిన డిగ్రీ కోర్సుల పరీక్షల ఫలితాలను మంగళవారం విసి ప్రొఫెసర్ పి రాజశేఖర్ విడుదల చేశారు ఫలితాలకు సంబంధించి వివరాలను దూరవిద్య కేంద్రం వెబ్సైట్ నందు పొందుపరిచినట్లు ఆయన తెలిపారు.పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ కే సోమశేఖర్ మాట్లాడుతూ బి ఎ బి కం బి బి ఏ మొదటి రెండవ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల డిప్యూటీ రిజిస్టర్ సయీద్ జైనులుద్దీన్ మాట్లాడుతూ ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్కు దరఖాస్తు చేసుకునేవారు ఒక్కో పేపర్ కు రూ . 770లను డిసెంబర్ 2వ తేదీలోగా చెల్లించి ఎనిమిదో తేదీలోగా దరఖాస్తులను దూరవిద్య పరీక్షలకు కోఆర్డినేటర్ కు అందేలా పంపాలని సూచించారు . ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్. బట్టు నాగరాజు ఇతర అదికారులు పాల్గోన్నారు.

బహుమతులు అందచేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చిప్స్‌లో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు : చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో నిర్వహించిన గ్రంధాలయ వారోత్సవాలు ముగిశాయి. కళాశాల గ్రంథాలయ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో వారోత్సవాలు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తెలిపారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు, అధ్యాపకులకు డెల్నెట్, నింబస్, జె.గేట్ వంటి వివిధ సంస్థల ఎలక్ట్రానిక్ రిసోర్సెస్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, 'లైబ్రరీ ఈజ్ ఎ గేట్వే ఫర్ నాలెడ్జ్ అండ్ ఇమాజినేషన్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, లైబ్రరీ ఎక్సటెన్షన్ సర్వీసెస్‌లో భాగంగా రెండ్రోజుల పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బెస్ట్ లైబ్రరీ యూజర్స్‌కు, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు,బహుమతులు అందచేశారు.

లే అవుట్లకు అనుమతులు తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు, లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ వాసవి నగర్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్, శ్రీనగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్మెంట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబందిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్ వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్‌గేజ్ ప్లాట్లు, యుటిలిటి ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్‌స్పేస్, గ్రీనరి, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని స్వయంగా పరిశీలించారు. నిబందనల పాటించని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అనంతరం శ్రీనగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, మాట్లాడుతూ నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనల ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.ఎల్‌టిపిలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డిపిఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలని, లేకుంటే తదుపరి అనుమతులు నిలిపివేయడం జరుగుతుందన్నారు. మాస్టర్‌ప్లాన్ ఎలైన్మెంట్ కానీ, లేదా మాస్టర్ ప్లాన్ లో చేసిన భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ అనుమతులు ఇవ్వబడవన్నారు. సెట్‌బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడినింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ మంజూరు చేయబోమన్నారు.